సాక్షి
నిజామాబాద్
ఆదివారం ׀ 17 ׀ నవంబర్ ׀ 2024



క్రీడలను జీవితంలో..

ఆరోగ్య పరిరక్షణ కోసం దైనందిన జీవితం లో క్రీడలను భాగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.

- 10లో ▸



రాజ్యాధికారమే ఎజెండాగా..

రాజ్యాధికారమే ఎజెండాగా బీసీలు ఐక్యంగా సాగాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పిలుపునిచ్చారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /16.4

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



మాక్లూర్: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టే పనులు చేయవద్దని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నిర్వాహకులకు సూచించారు. శనివారం మాణిక్‌బండార్‌లో నిజామాబాద్ ఐకేపీ నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. కాంటాల సమయంలో అవకతవకలకు జరుగుతున్నాయా ఆరా తీశారు. సంచులు, లారీలు, సన్నాలకు వేసే కలర్ డబ్బాల వంటివి కొరత లేకుండా ముందస్తు జాగ్రతగా ఉండాలన్నారు. ధాన్యం సంచులతో లోడ్ చేసిన లారీలను వెంటనే రైస్‌మిల్లులకు తరలించుకోవాలన్నారు. మాక్లూర్ సొసైటీ వైస్ చైర్మన్ శేఖర్, ఐకేపీ ఏపీఎం, రైతులు ఉన్నారు.

ఎస్సెస్సీ పరీక్ష ఫీజు గడువు పెంపు


నిజామాబాద్ అర్బన్ : పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 29వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించ్చవచ్చని డీఈవో అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఫైన్‌తో డిసెంబర్ 11 తేదీలోగా, రూ.200 ఫైన్‌తో 20వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 31వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించొచ్చని పేర్కొన్నారు.

పకడ్బందీగా సాగుతున్న సర్వే

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్‌అర్బన్: అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 4,69,988 నివాస గృహాలకు గాను శనివారం సాయంత్రం నాటికి 2,95,436 ఇళ్లలో వివరాల సేకరణ జరిగిందని, 62.86 శాతం సర్వే పూర్తయ్యిందని వివరించారు. జిల్లాలోని నివాస గృహాల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 3453 ఎన్యుమరేషన్ బ్లాక్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో బ్లాక్ పరిధిలోని ప్రతి ఇంటిని ఎన్యుమరేటర్లు సందర్శిస్తూ పక్కాగా సర్వే నిర్వహించేలా నిశిత పర్యవేక్షణ జరుపుతున్నామన్నారు. 358 మంది సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలిస్తూ, ఎన్యుమరేటర్లకు అవసరమైన సహకారం అందిస్తున్నారని అన్నారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లు కూడా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నారని వివరించారు. నిర్ణీత గడువులోపు జిల్లాలో ఇంటింటి సర్వే ప్రక్రియను సమగ్ర వివరాల సేకరణతో పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరిస్తూ, ఎన్యుమరేటర్లకు నిర్దేశిత వివరాలను అందించాలని కోరారు.







మహాభారత ఇతిహాసం నుంచి ఇప్పటి వరకు ఇందూరు నగరం తొమ్మిది సార్లు నామాంతరం చెందింది. ఇందూరు పూర్వనామం ఇంద్రపురి. విష్ణుకుండిన రాజైన ఇంద్రదత్తుడు తన పేరిట ఇంద్రపురిని నిర్మించాడని చరిత్ర. కాలానుగత పరిణామాల క్రమంలో భాగంగా ఇందూరును నిజామాబాద్ జిల్లాగా మార్పు చేశారు. ఇప్పటికీ ఎక్కువమంది ప్రజలు ప్రేమగా ఇందూరు అనే పిలుచుకుంటున్నారు.

సండే స్పెషల్

అశ్మక రాష్ట్రం నుంచి ఇందూరు!

- ఈ సీమకు తొమ్మిది సార్లు నామాంతరం ● 1905లో నిజామాబాద్‌గా మార్పు ● బోధన్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఇందూరు.. ఈ పేరును అత్యధిక మంది ప్రేమగా పిలుచుకుంటున్నారు. అధికారిక పేరు నిజామాబాద్ అయినప్పటికీ ఇందూరు అని పిలుచుకునేందుకే ఈ ప్రాంత ప్రజలు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. అయితే పురాణాలు, చరిత్రను పరిశీలిస్తే కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రాంతం పేరు తొమ్మిది రకాలుగా నామాంతరం చెందుతూ వచ్చింది.

✤ ప్రాచీన చరిత్ర నుంచి చూసుకుంటే నిజామాబాద్ ప్రాంతం పేరు అశ్మక రాష్ట్రం, పులాకదేశం, మంజీరకాదేశం, నాగభూమి, సపాదలక్షభూమి, పోదననాడు, కాసలనాడు, ఇందూరు, నిజామాబాద్ గా పేర్లు మార్చుకుంటూ వచ్చింది.

✤ గత కాలపు అనుభవాలు భవిష్యత్తుకు పునాదులు.. తాతముత్తాతల కథలు భావితరాలకు అనుభవ పాఠాలుగా ఉపయోగపడుతున్నాయి. చరిత్రను పరిశీలిస్తే ఆనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, పరిపాలనా అంశాలు, పరిస్థితులు తెలియజెబుతాయి. పురాణాలకు గ్రంథాలు, చరిత్ర తెలుసుకునేందుకు శాసనాలు కీలకం. అప్పటి గుళ్లు, కోటలు, కట్టడాలు, చెరువులు, ఇతర నిర్మాణాలు చరిత్రకు సాక్షి భూతాలుగా నిలుస్తున్నాయి. మతమౌఢ్యంతో చేసిన దాడులు.. కట్టడాలు, ఆలయాల ధ్వంసాలు మరిన్ని అంశాలను తెలుపుతాయి. ఈ నేపథ్యంలోనే ఇందూరు ప్రాంత చరిత్ర చూస్తే అనేక కీలక అంశాలు తెలుస్తున్నాయి. కాగా జైనయుగం సమయంలో అప్పటి పాలనావిభాగాలను దేశం, రాష్ట్రంగా పిలుచుకునే వారు. ఈ క్రమంలో ఇందూరు ప్రాంత నామాంతరాలు తెలుస్తున్నాయి.

✤ జిల్లాలోని బోధన్ ప్రాంతానికి చాలా పౌరాణిక ప్రాశస్త్యం, ఘనమైన చరిత్ర ఉంది. మహాభారతంలో 'అశ్మకోనామరాజర్షి స్సపాదన్యం న్యవేశయత్' అని ఉంది. అశ్మకుడనే రాజు పొదన్య నగరాన్ని పాలించినట్లు తెలుస్తోంది.

బౌద్ధయుగం నాటికి పరిపాలనాపరంగా రాజ్యాన్ని రాష్ట్రాలుగా, నగరాలుగా విభజించారు. విదర్భ రాష్ట్రం, సౌరాష్ట్రం, మహారాష్ట్రం, అపరాంతక రాష్ట్రం, అశ్మక రాష్ట్రంగా పిలిచేవారు. అశ్మక రాష్ట్రానికి రాజధానిగా 'పోతలి' (నేటి బోధన్) ఉండేది. దీంతో ఇందూరు ప్రాంతం అశ్మక రాష్ట్రంగా పేరుపొందింది. జైనయుగం నాటికి పాలనా విభాగాలను దేశములు, రాజ్యములుగా పిలిచారు. ఆ కాలంలో అంగ, వంగ, కళింగ పేర్లతో ఉండేది. ఇందూరు సీమను 'పులాక దేశం'గా పిలిచారు. తరువాత శాతవాహనుల కాలంలో 'మంజీరకాదేశం'గా పిలిచేవారు. రాష్ట్రకూటుల కాలంలో మెదక్, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాలను 'నాగభూమి'గా పిలిచారు. బోధన్ చాళుక్యుల మొదటి రాజధానిగా బోధన్ ఉండేది. నాడు దీన్ని 'సపాదలక్షభూమి' అనేవారు. గోదావరికి దక్షిణాన మంజీర నది నుంచి కాళేశ్వరం వరకు ఉన్న ప్రాంతాన్ని 'పోదననాడు'గా వ్యవహరించారు. కుతుబ్‌షాహీల పాలనాకాలంలో ఈ ప్రాంతాన్ని 'కాసలనాడు'గా పిలిచారు.

✤1876లో మొదటి సాలార్ ప్రధానిగా ఉన్న సమయంలో ఇందూరు నగరాన్ని జిల్లా కేంద్రంగా మార్చాడు. ఇందూరు పూర్వనామం ఇంద్రపురి. విష్ణుకుండిన రాజైన ఇంద్రదత్తుడు క్రీ.శ 388లో తన పేరిట ఇంద్రపురిని నిర్మించాడని చరిత్ర. ఇక రాష్ట్రకూట నిత్యవర్షేంద్రుడు క్రీ.శ 915లో బోధన్‌లో ఇంద్రనారాయణ ఆలయాన్ని నిర్మించాడని, దీంతో ఇంద్రపురి పేరు వచ్చినట్లు చెబుతారు. 1905కు ముందు వరకు ఈ ప్రాంతాన్ని ఇందూరు సీమ అనేవారు. 1905లో పునర్విభజనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి విడదీసి ఇందూరును నిజామాబాద్ జిల్లాగా మార్పు చేశారు. ఇప్పటికీ ఎక్కువ మంది ప్రేమగా ఇందూరు అనే పిలుచుకుంటున్నారు.



వివరాలు తెలుసుకుని గల్ఫ్ ఏజెంట్లకు

ఇండ్లు అద్దెకివ్వాలి

- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ వెల్లడి



ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు, షెట్టర్లు అద్దెకు ఇచ్చే ముందుజాగ్రత్తగా వ్యవహరించాలని ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పాస్‌పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మందిని మోసం చేస్తున్నారన్నారు. గల్ఫ్ ఏజెంట్లకు అద్దెకు ఇస్తే ముందస్తుగా వారి సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్ వారికి తెలిపాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ప్రభుత్వ భవనాల లాంటి చోట్ల విగ్రహాలను ఏర్పాటు ప్రతిష్ఠించరాదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుందన్నారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటుచేయరాదన్నారు. అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయన్నారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధం ఉందన్నారు. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత ఏసీపీ అనుమతి, 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతి పొందాలన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రోన్ల వాడకంపై నియంత్రణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో 'ఎ' (పెద్దలు) సర్టిఫికెట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లు అనుమతించరాదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధమన్నారు.

గ్రూప్-3 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో నేడు పరీక్షకు హాజరు కానున్న 19,941 మంది అభ్యర్థులు
- గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారుల సూచనలు



నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆదివారం జరుగనున్న గ్రూప్-3 పరీక్షకు జిల్లా అధికారం యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. రెండ్రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయి. ఈనెల 18న ఉదయం సెషన్‌లో పరీక్ష ఉంటుంది. జిల్లాలో మొత్తం 19,941 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తం 66 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రతి మూడు కేంద్రాలకు ఒకరు చొప్పున 22 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశితంగా పర్యవేక్షిస్తా యి. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత లోనికి అనుమతి ఉండదు. చీఫ్ సూపరింటెండెంట్ కు తప్ప మరెవ్వరికీ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదు. ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయనున్నారు. పరీక్ష ప్రారంభ సమయం నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

■ ఆర్మూర్ మార్గంలోని అడవిమామిడిపల్లి వద్ద రైల్వే బ్రిడ్జి పనులు కొనసాగుతున్న దష్ట్యా గ్రూప్-3 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలను దారి మళ్లించినట్లు తెలిపారు.

పోలీసు బందోబస్తు

ఖలీల్‌వాడి: గ్రూప్-3 పరీక్షలకు 200 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు.

అధికారులపై దాడులు ఆటవిక చర్య



పవర్ హౌజ్ వద్ద నిరసనలో మాట్లాడుతున్న ఎస్ఈ రాపెల్లి రవీందర్, జేఏసీ, యూనియన్ నాయకులు

- విద్యుత్ ఉద్యోగ సంఘాలు, జేఏసీ ధర్నా

సుభాష్‌నగర్: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై రైతులు దాడి చేయడం, బోధన్ మండలం ఊట్‌పల్లి అసిస్టెంట్ లైన్‌మెన్ నవీన్‌పై దాడికి పాల్పడటం ఆటవిక చర్యగా టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రాపెల్లి రవీందర్ అభివర్ణించారు. ఈ దాడులను ఖండిస్తూ ఎలక్ట్రిసిటీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో పవర్‌హౌజ్‌లో నిరసన తెలియజేశారు. రవీందర్ మాట్లాడుతూ అధికారులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్, 1104 యూనియన్ కంపెనీ ప్రెసిడెంట్ రఘునందన్, 327 యూనియన్ సెక్రటరీ గంగాధర్ మాట్లాడారు. ఆందోళనలో జేఏసీ కో కన్వీనర్ తోట రాజశేఖర్, డీఈఈలు ఏ రమేష్, వెంకటరమణ, నాయకులు సురేష్‌కుమార్, జి శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, గంగారాం నాయక్, నాంపల్లి, శ్రీనివాస్‌రావు, వేణుగోపాల్, ఆర్ చంద్రశేఖర్, రాజేందర్, నగేష్‌కుమార్, పోశెట్టి, నిజాముద్దీన్, సునీత, సరిత, సుమిత, గౌతమి, దివ్య, తదితరులు 300 మంది విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే గందరగోళం!

- ఇంకా పూర్తికాని ఇంటింటి స్టిక్కరింగ్
- బ్లాక్‌ల వారీగా విధానంలో ఇబ్బందులు
- ఎన్యుమరేటర్ల కోసం ఎదురుచూపులు
- డ్యూటీలు సరిగా చేయని టీచర్లు, అంగన్‌వాడీలు
- సకాలంలో పూర్తికావడం కష్టమే.. ?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ ఇంటింటి సమగ్ర సర్వే అయోమయంగా తయారైంది. 'బ్లాక్'ల విధానంతో సర్వేకు తిప్పలు తప్పడం లేదు. స్థానికేతరులతో సర్వే చేయించడం వల్ల సమస్యలు వస్తున్నాయి. దానికి తోడు ఎన్యుమరేటర్లు తరచూ డుమ్మాలు కొడుతున్నారు. ఎవరు ఎక్కడ సర్వే చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ నగరంలో ఇండ్లు దాదాపు లక్ష వరకు ఉంటాయి. ఇందులో 80 వేలు నివాసయోగ్యమైనవికాగా, మరో 15 శాతం దుకాణాలు, వాణిజ్య సముదాయాలుగా గుర్తించారు. దాదాపు 80 వేలకు పైగా ఇండ్లలో ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. అందుకుగాను 175 మంది ఎన్యుమరేటర్లును నియమించారు. ఒక్కో ఎన్యుమరేటర్ దాదాపు 150 ఇండ్లు సర్వే చేయాల్సి ఉంటుంది. నగర కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు ఉన్నాయి. ఈనెల 6 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. అందులో భాగంగా తమకు ఇచ్చిన ఇండ్లు గుర్తించి, ఇంటికి స్టిక్కర్ వేయాలి. ఈ ప్రక్రియ కోసం వారం రోజులు కేటాయించారు. ఈ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ అంకిత్‌లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఇప్పటి వరకు 93 వేల ఇండ్లను పరిశీలించి స్టిక్కరింగ్ వేశామని కమిషనర్ ప్రకటించారు. అయితే చాలా డివిజన్లలో స్టిక్కరింగ్ వేయలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. సర్వే ప్రారంభమై పక్షం రోజుల వుతున్నా సర్వే ఇండ్లను ఇంకా గుర్తించనే లేదు.

గత సర్వేలు డివిజన్‌ల వారీగానే..

సర్వేను డివిజన్ల వారీగా చేయాల్సి ఉంటుంది. గతంలో ప్రభుత్వం చేపట్టిన సర్వేలన్నీ డివిజన్‌ల వారీగానే చేశారు. ఈసారి మాత్రం ఎన్యుమరేషన్ బ్లాక్ (ఈబీ)లుగా విభజించి సర్వే చేపట్టారు. ఈబీల ఆధారంగానే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను నియమించారు. దాంతో సమస్యలు వస్తున్నాయి. ఎన్యుమరేటర్లు ఏ డివిజన్‌లో సర్వే చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

కష్టంగా మారిన ఇండ్ల గుర్తింపు..

అయా డివిజన్‌లలో సర్వే నిర్వహిస్తే ఆ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీలు, ఆశ వాలంటీర్లు, డ్వాక్రా గ్రూప్ లీడర్లుతోపాటు స్థానిక కార్పొరేటర్‌లు సహాయపడతారు. సర్వే చేస్తున్న ఇంటి వివరాలు, కుటుంబ వివరాలు ఇతర సమచార సేకరణ తేలిక అవుతుంది. కాగా స్థానికుల సహా యం లేకుండా బయటివారు వచ్చి సర్వే చేయ డం వల్ల వారికి ఇండ్ల గుర్తింపు కష్టంగా మారింది. గూగుల్ మ్యాప్‌లు ఇచ్చినా, అవి పూర్తిస్థాయిలో సహాయపడటం లేదు. ఎవరు ఎక్కడ సర్వే చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. వరుస సంఖ్యలో సర్వే చేస్తే కనీసం స్థానికులకు తెలిసే అవకాశం ఉంది. బ్లాక్‌ల వారీగా సర్వే చేయడం వల్ల ఇబ్బందులు తప్ప డం లేదు. స్థానికంగా ఉండే ప్రజాప్రతినిధులు తమ డివిజన్‌లలో ఎక్కడ సర్వే జరుగుతుందో తెలియని అయోమయ స్థితి నెలకొందని వాపోతున్నారు. దాంతో సర్వే చేసేవారు ఎప్పుడు వస్తారో అని నగరవాసులు ఎదురుచూస్తున్నారు.



ఒకవేళ ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తే వారి పరిస్థితి ఏమిటన్నద ప్రశ్నార్థకంగా మారింది.

ఎన్యుమరేటర్లకు తిప్పలు..

సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లకు క్షేత్రస్థాయిలో తిప్పలు తప్పడం లేదు. సర్వేలోని ప్రశ్నలను విని కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత సమాచారం పట్ల నిరాసక్తత.. వాస్తవ సమాచారం ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా ఆదాయం, ఆస్తి, వ్యక్తిగత రుణాల విషయాలు..

ప్రభుత్వ పథకాల లబ్ధి.. కౌలు వివరాలు.. విదేశాలకు వెళ్లినవారి వివరాలు వంటి పలు అంశాలను దాట వేస్తున్నారు. ఎన్యుమరేటర్లు సర్వే పక్కాగా నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు సరియైన సమాధానాలు చెప్పకపోతే తామేం చేస్తామని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు.

నెల రోజుల గడువు

ఈ సర్వేకు ప్రభుత్వం నెల రోజుల గడువు విధించింది. ప్రతిరోజు సర్వే వివరాలు అందించాలని సూచించింది. అయితే ప్రభుత్వ అధికారులు సెల వు దినాల్లో పనిచేయడానికి ఇష్టపడటం లేదు. అంగన్‌వాడీలు సైతం పూర్తిస్థాయిలో సర్వేలో పాల్గొన డం లేదు. సర్వే చేసినందుకు ఏ మేరకు గౌరవేతనం ఇస్తారో కూడా స్పష్టంగా చెప్పకపోవడంతో ఎన్యుమరేటర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇన్ని సమస్యల మధ్య సకాలంలో సర్వే, డాటా ఎంట్రీ పూర్తవుతుందా అనేది మిగిలిన ప్రశ్నగా మారుతోంది.

మా డివిజన్‌లో సమాచారం లేదు



నేను 24వ డివిజన్‌లో ఉంటాను. సర్వే ఎవరు చేస్తున్నారు. ఎక్కడ చేస్తున్నారు అనే సమాచారం లేదు. మున్సిపల్ అధికారులను అడిగినా సరియైన సమాచారం ఇవ్వడం లేదు. దాంతో గాయత్రినగర్‌వాసులు అయోమయంలో ఉన్నారు. అధికారులు స్థానిక కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వాలి.

– ఇప్పకాయల కిషోర్, గాయత్రినగర్‌వాసి

ఎవరూ రావడం లేదు



పది రోజుల క్రితం మా ఇంటికి స్టిక్కర్ అతికించారు. ఇప్పటివరకు సర్వేకు ఎవరూ రాలేదు. ఎప్పుడు వస్తారో కూడా తెలియదు. ఒకవేళ మేం ఇంట్లో లేనప్పుడు వస్తే ఎట్లా.. మళ్లీ సర్వే చేస్తారా లేదా అన్నది అధికారులు తెలిపాలి.

– రామారాజు, పెద్దబజార్‌వాసి

సహకరిస్తున్నారు



మా డివిజన్‌లో 8 మంది సర్వే చేస్తున్నారు. నా పరిధిలో సర్వేలోఎలాంటి సమస్యలు ఎదురుకాలేదు. అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నారు. వారిచ్చిన సమాధానాల ఆధారంగానే సర్వేలో వివరాలు నమోదుచేస్తున్నాం. డౌట్స్ వస్తే వచ్చినప్పుడు మా సూపర్‌వైజర్ క్లారిటీ ఇస్తున్నారు.

– పద్మావతి, కాలూరు ఆర్‌పీ

పక్కాగా జరుగుతోంది



సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. కొన్నిచోట్ల సమస్యలు వస్తున్నాయి. వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాం. స్థానిక నాయకుల సహాయం తీసుకోవాలని సూచించాం. త్వరలో స్పెషల్ టీం పర్యవేక్షిస్తుంది.

– రాజేంద్రకుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్

క్లుప్తంగా

నేర పరిశోధనలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ జి. వైజయంతి ఆదేశాల మేరకు నిజామాబాద్‌ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ ఎండీ రహీమొద్దీన్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశానికి ఉమ్మడి జిల్లాలకు చెందిన పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు హాజరుకాగా.. కొత్త న్యాయ చట్టాలు భారతీయ న్యాయసంహిత–2023, భారతీయ నాగరిక్‌ సురక్షా సంహిత– 2023, భారతీయ సాక్ష్య అధినియం–2023 లపై, కేసుల పరిశోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ అవగాహన కల్పించారు. నేర పరిశోధనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన చట్టాలను అవలంబించి నేరస్తులకు శిక్షపడేవిధంగా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు వారి పరిధిలోని పోలీసులకు సలహాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు పీసు రాజేశ్వర్‌, బంటు వసంత్‌, రాజ్‌గోపాల్‌గౌడ్‌, నిమ్మ దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌ ఖాందేష్‌, అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు అశోక్‌, శివరాంనాయక్‌, చిదిరాల రాణి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఈషా గ్రామోత్సవ్‌ ప్రారంభం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ మైదానంలో ఈషా ఫౌండేషన్‌ గ్రామోత్సవం క్రీడాపోటీలను అడిషనల్‌ కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈషా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఫౌండేషన్‌ సభ్యురాలు వసంత గీత మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడాపోటీలు దోహదపడతాయన్నారు. మొదటి రోజైన శనివారం వాలీబాల్‌పోటీలు నిర్వహించగా, ఆదివారం త్రోబాల్‌ పోటీలు నిర్వహించనున్నారు.

ఆ చోటనే ప్రమాదాలు..

- తడపాకల్‌ గోదావరిలో ప్రమాదకరంగా రెండు పాయింట్‌లు
- కొట్టుకుపోయిన హెచ్చరిక బోర్డులు
- సుడిగుండాల్లో కలుస్తున్న ప్రాణాలు



గోదావరి నదిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతం

మోర్తాడ్‌: ఏర్గట్ల మండలం తడపాకల్‌ గోదావరి తీరంలో రెండు పాయింట్‌లు ప్రమాదకరంగా మారాయి. తరచూ ఆ ప్రాంతాల్లోని ప్రమాదాలు చోటుచేసుకుని భక్తులు ప్రాణాలు కోల్పోతున్నారు. పదేళ్లలో సుమారు 20 మంది నీట మునిగి మృతి చెందారు. ఈత వచ్చిన వారు సైతం ప్రాణాలు కోల్పోవడానికి అక్కడ ఉన్న సుడిగుండాలే కారణమని స్థానికులు అంటున్నారు. నదిలో రెండు చోట్లనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అక్కడ ఇప్పటి వరకు ఏనాడూ నీరు ఎండిపోయిన జాడ లేదని స్థానికులు తెలిపారు. ఎంతటి ఎండా కాలమైనా నీరు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు.

పట్టించుకునే వారేరి..?

తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రెండు రోజుల కింద మాక్లూర్‌ మండలం మానిక్‌బండార్‌కు చెందిన ఇంటర్‌ విద్యార్థి రామ్‌చరణ్‌ గోదావరిలో పెద్దవాగు కలిసే ప్రాంతానికి వెళ్లి నీట మునిగి మరణించాడు. అతను నీటిలో మునిగిన సమయంలో తన కొడుకును రక్షించుకోవడానికి తల్లి గంగామణి సైతం నీటిలోకి దూకింది. ఆమెను గుర్తించిన స్థానికులు ఇద్దరిని బయటకు తీసినా రామ్‌చరణ్‌ ప్రాణాలు మాత్రం దక్కలేవు. ఇలా రామ్‌చరణ్‌ ఒక్కడే కాకుండా గతంలోనూ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఐదు నెలల కింద స్థానిక పశువుల కాపరి ఎప్పటిలాగే తన పశువుల మందతో గోదావరి నదికి అవతలి వైపునకు వెళ్లగా అతను నీటిలో మునిగి మరణించాడు. అతడికి ఈత రావడంతోపాటు గోదావరిపై పూర్తి అవగాహన ఉన్నప్పటికీ ప్రాణాలతో బయటపడలేదు. ఏడాది కింద నిజామాబాద్‌లోని బ్యాంకు కాలనీకి చెందిన బ్యాంకు ఉద్యోగి మరణించాడు. కొందరికి ఈత వచ్చినా నీరు సుడి తిరగడంతో బతికి బట్టకట్టలేకపోయారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే చోట్ల గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు నీటిలో కొట్టుకుపోగా, మళ్లీ ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి గోదావరి నది వద్ద ప్రమాద సూచికలను మరోసారి ఏర్పాటు చేయించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

గతంలో బోర్డులు ఏర్పాటు చేయించాం

గోదావరిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న చోట్ల హెచ్చరిక బోర్డులను గతంలో ఏర్పాటు చేయించాం. అవి కొట్టుకపోయాయి. ప్రమాదాలు ఒకటి, రెండు చోట్లనే జరుగుతున్నాయి. ఇందుకు కారణం ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదు. భక్తులు జాగ్రత్తగా వ్యవహరిస్తే ప్రమాదాల ముప్పు తప్పుతుంది.

– పత్తిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌, తడపాకల్‌

ఆలయాల వద్ద రాజకీయాలు మానుకోవాలి



మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

మోర్తాడ్‌/నిజామాబాద్‌ సిటీ: ఆలయాల వద్ద రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి రాష్ట్ర సహకార యూనియన్‌ చైర్మన్‌, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సూచించారు. దేవుని కోసం మనం వెళ్లాలి తప్ప.. దేవుడు మనకోసం ఆగరని గుర్తించాలని ఆయన హితవు పలికారు. దైవ దర్శనం కాకుండా తనపై కుట్ర పన్నారని ప్రశాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మానాల మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. లింబాద్రి గుట్ట జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడం, కొందరు రోడ్లకు ఇరువైపులా వాహనాలను వదిలిపెట్టి దర్శనానికి వెళ్లడం, మరో ముగ్గురు రాంగ్‌ రూట్‌లో రావడం కారణంగానే ట్రాఫిక్‌ జామ్‌ అయ్యిందని స్పష్టం చేశారు. దీనికి ఏదో రాజకీయం జరిగిందని లేనిపోని విషయాలను ఊహించుకుని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి రాజకీయం చేయాలని చూడటం సమంజసంగా లేదన్నారు. ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో తనతోపాటు ఈరవత్రి అనిల్‌, సునీల్‌రెడ్డి, ఇతర నాయకులు సైతం రెండు కిలోమీటర్లు నడిచి గుట్టకు చేరుకున్నామని తెలిపారు. అధికారం కోల్పోవడంతో అప్పటి దర్పం లేదనే ఆలోచనలో ఏవేవో మాట్లాడటం సరికాదన్నారు. అధికార పక్షంలో లేనివారికి దైవ దర్శనం జరగకుండా ఆపే సంస్కృతి గతంలో ఏ పార్టీకి ఉందో ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. రాజకీయం ఎక్కడ చేయాలో అక్కడ చేస్తేనే ప్రజలు స్వాగతిస్తారని, ప్రజా సంక్షేమంపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు.

సైబర్‌ నేరాలపై అవగాహన



దోమకొండ: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో శనివారం సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి మాట్లాడారు. డయల్‌ 100, మద్యం సేవించి ప్రయాణాలు, హెల్మెట్‌ ధరించడం తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామారెడ్డి పోలీస్‌ కళాబందం సభ్యులు ప్రభాకర్‌, సాయిలు, ఏఎస్సై, సిబ్బంది చంద్రకాంత్‌ తదితరులున్నారు.

ఎస్‌జీఎఫ్‌ బేస్‌బాల్‌ అబ్జర్వర్‌గా గంగామోహన్‌



నిజామాబాద్‌నాగారం: నిర్మల్‌ జిల్లాలో నిర్వహించనున్న స్కూల్‌ గేమ్స్‌ అండర్‌ – 17 బేస్‌బాల్‌ రాష్ట్ర టోర్నమెంట్‌ అబ్జర్వర్‌గా జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఫిజికల్‌ డైరెక్టర్‌ మర్కంటి గంగామోహన్‌ వ్యవహరించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్‌ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌గౌడ్‌, ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి నాగమణి, జిల్లా సాఫ్ట్‌బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బేస్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎల్‌ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినో ద్‌, సీనియర్‌ ఫిజికల్‌ డైరెక్టర్లు సంగీతరావు, నీరజారెడ్డి, పవన్‌కుమార్‌, రాజ్‌కుమార్‌, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సాయిలు, రామకృష్ణ, గంగాధర్‌, డాక్టర్‌ నరసింహారావు, సునీ త, కృష్ణ,మాలతి, గంగాధర్‌ అభినందించారు.

ఘనంగా పలుగు గుట్ట జాతర



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

- కిటకిటలాడిన కేదారీశ్వర గుట్ట
- ఆశ్రమానికి పోటెత్తిన జనం
- హాజరైన ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కేదారీశ్వర ఆశ్రమం శివనామ స్మరణతో మారుమోగింది. ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్‌ 36 రోజులపాటు చేపట్టిన కార్తీక మాస అనుష్టాన దీక్షను శుక్రవారం అర్ధరాత్రి విరమించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శనివారం ఆశ్రమంలో జాతర నిర్వహించారు. మంగిరాములు మహరాజ్‌ దసరా పర్వదినాన దీక్షలోకి వెళ్లి శుక్రవారం అర్ధరాత్రి 12.05 గంటల సమయంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహమండపానికి చేరుకుని భక్తులనుద్దేశించి ఉపదేశం చేశారు.

దైవ చింతనే మంచికి మార్గం

కార్తీక మాస అనుష్టాన దీక్ష విరమణ కార్యక్రమానికి ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజరెడ్డి, బ్రహ్మకుమారి ఓం శాంతి సునీత పాల్గొన్నారు. ఎమ్మెల్యే దీక్ష విరమించిన మంగిరాములు మహరాజ్‌ను పట్టు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక కళ్యాణార్థం మంగిరాములు మహరాజ్‌ చేస్తున్న కఠోర దీక్ష మహత్తర కార్యక్రమమని అన్నారు. దైవ చింతనే మంచికి మార్గమని పేర్కొన్నారు. జాతరకు భక్తులు పోటెత్తారు. రాములు మహరాజ్‌ భక్తులకు బొట్టుపెట్టి ఆశీర్వదించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కవితా రచనలో రాష్ట్రస్థాయి బహుమతులు



రూరల్‌ మండలం గుండారంలో..



మోపాల్‌ మండలం సిర్‌పూర్‌లో..

నిజామాబాద్‌ రూరల్‌/మోపాల్‌: కోడూరి శాంతమ్మ మెమోరియల్‌ ట్రస్టు, తెలంగాణ సారస్వత పరిషత్‌ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవిత పోటీల్లో నిజామాబాద్‌ రూరల్‌ మండలం గుండారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, మోపాల్‌ మండలం సిర్‌పూర్‌ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. గుండారం పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఆకుల కృష్ణవేణి ప్రోత్సాహక బహుమతి గెలుచుకోగా, ఏకపాత్రాభినయం పోటీలో రెంజర్ల లాస్య బహుమతిని దక్కించుకుంది. పుస్తక సమీక్ష, పాటల పోటీల్లో కృష్ణవేణి మరో రెండు బహుమతులు గెలుచుకుంది. సిర్‌పూర్‌ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మేఘన కవితా రచనలో ప్రథమబహుమతి పొందింది. 20 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబర్చి అభినందన పత్రాలు అందుకున్నారు. విద్యార్థులను సృజన రంగంలో తీర్చిదిద్దుతున్న ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక అధ్యక్షుడు, తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావు అతిథులు సత్కరించారు.

క్రీడా సమాచారం

● రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపిక



శ్రీహరి



చందన

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీహరి, పడకల్‌ గ్రామానికి వొల్కాజీ చందన రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎం లింగన్న, ఫిజికల్‌ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ శనివారం తెలిపారు. బాలుర, బాలికల విభాగాల్లో ఎంపికైన వీరు శనివారం నుంచి సోమవారం వరకు మెదక్‌ జిల్లా చేగుంటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

● రాష్ట్రస్థాయి ఉషూ పోటీలకు..



మోర్తాడ్‌(బాల్కొండ): రెజ్లింగ్‌, కరాటే, కిక్‌ బాక్సింగ్‌ రాష్ట్ర స్థాయి పోటీలకు తిమ్మాపూర్‌ విద్యార్థులు ఎంపికైనట్లు ఉన్నత పాఠశాల పీఈటీ సింధూజ తెలిపారు. శనివారం నిర్వహించిన జిలాస్థాయి పోటీల్లో మనోజ్ఞ, అక్షిత(7వ తరగతి), నవ్య(8వ తరగతి) ఉత్తమ ప్రతిభకనబర్చి ఆదివారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ముప్కాల్‌ మండల కేంద్రంలో ఉషూ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నారన్నారు.

● రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు..



మాక్లూర్‌: క్యూరియస్‌ అకాడమీలో శిక్షణ పొందిన మండలంలోని చిన్నాపూర్‌ గ్రామానికి చెందిన గంగోనే రుషికేశ్‌, రాఘ పూజిత, స్నికిత అండర్‌ –19 విభాగంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 14న నిజామాబాద్‌ నగరంలో నిర్వహించిన ఎంపికలో రుషికేష్‌, పూజిత, స్నికితలు ఉత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన క్రీడాకారులు బయల్దేరి వెళ్లినట్లు అకాడమీ నిర్వాహకుడు గంగోనె వినోద్‌ తెలిపారు.

● ఎస్‌జీఎఫ్‌ బేస్‌బాల్‌ పోటీలకు..



ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని పిప్రి రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్‌ – 17 ఎస్‌జీఎఫ్‌ రాష్ట్రస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ పూర్ణచందర్‌ తెలిపారు. ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్మల్‌ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో రోహన్‌, హర్ష పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను వైస్‌ ప్రిన్సిపాల్‌ సాయన్న, ఉపాధ్యాయులు దయాళ్‌, గంగాధర్‌, చక్రపాణి, పీడీ జ్ఞానేశ్వర్‌, పీఈటీ రాజేందర్‌ అభినందించారు.

● విద్యార్థులకు క్విజ్‌ పోటీలు



నిజామాబాద్‌అర్బన్‌: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం పాఠశాలల విద్యార్థులకు క్విజ్‌ పోటీలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంత రెడ్డి రాజిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు తారకం, బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లా(నిజామాబాద్‌, కామారెడ్డి) రూరల్‌ గేమ్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జూనియర్‌, సీనియర్‌ బాలబాలికల బ్యాడ్మింటన్‌, క్రికెట్‌, చెస్‌ ఎంపిక పోటీలను ఈ నెల 18న నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి మహేశ్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్‌ టోర్నమెంట్‌ సెలక్షన్స్‌ను పాలిటెక్నిక్‌ గ్రౌండ్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 20వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న పోటీలకు పంపిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 90145 81059, 70132 20107 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఓవరాల్‌ చాంపియన్‌ ధర్మారం గురుకులం



డిచ్‌పల్లి: ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు కంజర గురుకులంలో నిర్వహించిన 10వ జోనల్‌ లెవెల్‌ గేమ్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌ మీట్‌లో ధర్మారం (బి) గురుకుల బాలికల పాఠశాల/కళాశాల విద్యార్థినులు అన్ని విభాగాల్లో ఓవర్‌ ఆల్‌ చాంపియన్‌గా నిలిచారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌ నోర్రిసా, ఫిజికల్‌ డైరెక్టర్‌ నీరజారెడ్డి, పీఈటీ స్వప్న, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

క్రైం కార్నర్‌

తాగిన మైకంలో చెరువులో దూకి ఆత్మహత్య



హన్మాండ్లు మృతదేహం

నవీపేట: నవీపేట శివారులోని తడగామ చెరువులో దూకి మండల కేంద్రానికి చెందిన ముదాడం హన్మాండ్లు (39) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌ శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం తాగిన మైకంలో బయటకు వెళ్లిన హన్మాండ్లు ఇంటికి తిరిగి రాలేదన్నారు. గతంలో తాగిన మైకంలో ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు. మద్యానికి బానిసైన హన్మాండ్లు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి మహిళ మృతి

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన ఆవునూరి సాయవ్వ(38) అనే మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. బిడ్డల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీర్చేందుకు భర్త దుబాయికి వెళ్లగా అతడికి అక్కడ ఉపాధి లభించకపోవడంతో డబ్బులు పంపించడం లేదు. ఇక్కడ అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన సాయవ్వ గురువారం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ జిల్లా కేంద్రప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత

● ముగ్గురి అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని టేక్రియాల్‌ బైపాస్‌ వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేసిన పోలీసులకు 110 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన చందూలాల్‌, ఆశిష్‌తోపాటు మరోకరిని (మైనర్‌) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా కామారెడ్డిలో నివాసముంటూ కార్పెంటర్‌ పనులు చేస్తున్న ముగ్గురు బైక్‌పై టేక్రియాల్‌ వైపు వెళ్లారు. వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. ఇటీవల యూపీకి వెళ్లిన ఓ యువకుడు అక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చినట్లు తెలిసింది. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

ఒకరి అదృశ్యం

సిరికొండ:మండలంలోని ముషీర్‌నగర్‌ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. కుటుంబంలో గొడవల కారణంగా ఈనెల 14న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త శనివారం పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఎత్తొండ శివారులో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌ స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు సమాచారమిచ్చినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

యంచ వద్ద వాహనాల తనిఖీ


నవీపేట: మండలంలోని యంచ చెక్‌ పోస్ట్‌ సమీపంలో పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. నిజామాబాద్‌ అడిషనల్‌ డీసీపీలు కోటేశ్వర్‌రావు, బస్వారెడ్డి, నిజామాబాద్‌ నార్త్‌ రూరల్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై వినయ్‌ తనిఖీల్లో పాల్గొన్నారు. ఏబీవీపీ ఆందోళన నేపథ్యంలో చలో ట్రిపుల్‌ ఐటీకి వెళ్లకుండా వాహనాల తనిఖీ చేపట్టారు. 12 మందిని అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

అదుపు తప్పిన స్కూల్‌బస్సు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలకు చెందిన బస్సు శనివారం ఉదయం మండలంలోని చిట్యాల శివారులో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. రోజూలాగే చిట్యాలకు వెళ్లిన స్కూల్‌ బస్సు గ్రామానికి చెందిన సుమారు 30 మంది విద్యార్థులను ఎక్కించుకొని కామారెడ్డికి వెళ్తుండగా చిట్యాల వైపు వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పింది. బస్సు పొదల్లో నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌ అజాగ్రత్త కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపారు. ఘటనా స్థలానికి విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

నాలుగు దుకాణాల్లో చోరీ



ఎల్లారెడ్డి: పట్టణంలోని తెలంగాణ భవన్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌లోని నాలుగు దుకాణాల్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపారు. పట్టణంలోని గ్రాండ్‌ రెస్టారెంట్‌లోని కౌంటర్‌ నుంచి రూ.3వేలు, పక్కనే ఉన్న దుకాణంలో నుంచి ఆయిల్‌ డబ్బాతోపాటు మరో దుకాణంలో నుంచి పెయింట్‌ డబ్బాలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్‌: మండలంలోని మంచిప్ప గ్రామంలో బలుస శ్రీనివాస్‌ అనే వ్యక్తిపై అకారణంగా దాడికి పాల్పడిన చింతకుంట శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ శనివారం తెలిపారు. బలుస శ్రీనివాస్‌కు చెందిన వ్యవసాయ భూమిని చింతకుంట శ్రీనివాస్‌ కౌలు చేస్తున్నాడని, కౌలు డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. ఈ క్రమంలో తనపై చింతకుంట శ్రీనివాస్‌ దాడి చేశాడని బాధితుడు బలుస శ్రీనివాస్‌ ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు.